ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024
5
పార్వతీపురం మన్యం

మీ సేవా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో గల మీ సేవా కేంద్రాలను సోమవారం డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ అధికారి వివి గోపాలకృష్ణ తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం మీ సేవా కేంద్రాలు పని చేస్తున్నాయా, రికార్డ్ మేరకు సక్రమంగా ఉందా లేదా అని కూడా తనిఖీ చేశారు. పక్కాగా చలనా రిజిస్టర్ పొందుపర్చాలని, అదే విధంగా వచ్చిన వారికి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఎక్కడా ఎటువంటి తప్పులకు అవకాశం లేకుండా చూసుకోవాలి అని అన్నారు.

శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, శేషగిరి తల్లి సూర్యకాంతం, యుటిఎఫ్ నాయకులు; సభకు హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు

యుటిఎఫ్ బలోపేతమే శేషగిరికి నివాళి

కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య ● వర్ధంతి సభలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడ్ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ఏ కోణంలో చూసినా పరిణితి చెందిన నాయకత్వ లక్షణాలు గల వ్యక్తి శేషగిరి. ఉపాధ్యాయులు విరాళాలు ఇచ్చి విజ్ఞాన కేంద్రం నిర్మాణం చేయడం రాష్ట్రంలో ఎక్కడా లేదు. ఆ గౌరవం శేషగిరికి దక్కడం గర్వంగా ఉంది. సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే శేషగిరికి నివాళి' అని శాసనమండలి పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి 3వ వర్ధంతి సభ సోమవారం కెఎల్ పురంలోని శేషగిరి విజ్ఞానకేంద్ర భవనంలో జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బాల సుబ్రహ్మణ్యంతో పాటు శేషగిరి తల్లి సూర్య కాంతం, కుటుంబ సభ్యులు, యుటిఎఫ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'విద్యారంగంలో పరిణామాలు.. సవాళ్లు.. కర్తవ్యాలు' అనే అంశంపై బాల సుబ్రహ్మణ్యం స్మారకోపన్యాసం చేశారు. కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య అందుతుందని అన్నారు. కామన్ స్కూల్స్ విధానం అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓట్లకోసం పథకాలను మాత్రమే ఆశగా చూపుతున్నాయని విమర్శించారు. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది పేదలు, వారి పిల్లలేనన్నారు. నిరుపేదలు మాత్రమే చదువుకునే పాఠశాలలు ఉంటే వారికి ఏమి కావాలో అడగలేరని, అటువంటి విద్యా వ్యవస్థలో అభివృద్ధి కూడా ఉండదని అన్నారు. సమాజంపై అవగాహన కలిగించే విద్య ఉండాలన్నారు. దేశంలో అందరూ ఒకే గొడుకు కింద చదివే కామన్ విద్యా విధానం అవసరమన్నారు. ఈ విద్యా విధానం ద్వారానే అంతరాలు లేని సమాజానికి రూపకల్పన జరుగుతుం దన్నారు. నేడు విద్యా విధానం కులాల పేరుతో పాఠశాలలు ఏర్పడి ముక్కలు ముక్కలుగా మారిపోయిందని ఆవేదన చెందారు. నేడు మన రాష్ట్రంలో విద్యా వ్యాపారం జరుగుతోందన్నారు. వ్యాపార వేత్తలు ఢిల్లీలో సమావేశమై విద్యా రంగం ద్వారానే ఎక్కువ లాభం వస్తుందనే నిర్ణయానికి వచ్చాయంటే విద్యా వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. నేడు మన రాజకీయ నాయకులలో 60 నుంచి 70 శాతం మందికి విద్యా వ్యాపార సంస్థలు ఉన్నాయన్నారు. నేడు ప్రైవేటు విద్యా వ్యాపారవేత్తలు ఎమ్మెల్సీలుగా, ఎమ్మెల్యేగా, ఎంపీలుగా అన్నారు. రాష్ట్రంలో 1200 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఉపాధ్యాయులు గ్రహించాలన్నారు. పేదలకు చదువు చెప్పే ప్రభుత్వ బడి లేకపోతే మనం ప్రజలకు వ్యతిరేకంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. మన గౌరవాన్ని, భవిష్యత్ ను నిర్ణయించేది బడి పిల్లలు మాత్రమేనని, మనం, జనం కలిసి ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడుకునే విధంగా ముందుకు సాగాలన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన శేషగిరిని స్ఫూర్తిగా తీసుకొని విద్యారంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి సెమినార్లు పెట్టి సమాజంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచే ప్రయత్నంలో ఆయన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలను నడపడంలో దిట్ట శేషగిరి అన్నారు. స్టడీ సర్కిల్స్ నిర్వహించడంలో రాష్ట్రానికే మన జిల్లాను ఆదర్శంగా నిలిపారని తెలిపారు. ఆయన అందించిన స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ శేషగిరి స్ఫూర్తితో యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా శేషగిరి విజ్ఞాన కేంద్రానికి పది వేలు విరాళం ప్రకటించారు. బిఇడి కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ శర్మ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న శేషగిరి మరణం యుటిఎఫ్‌కు తీరని లోటని అన్నారు. తాను విద్యా శాఖలో, జెడ్‌పి కార్యాలయంలో పని చేసినప్పుడు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేయించుకోవడంలో శేషగిరి చూపిన చొరవ స్ఫూర్తి దాయకం అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎపిటిఎఫ్ (257) నాయకులు శ్రీనివాసరావు, పిఆర్‌టియు నాయకులు బి.శివప్రసాద్, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస, మన్యం జిల్లా అధ్యక్షులు రమేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, శ్రీకాకుళం జిల్లా నాయకులు శేషగిరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాజాగా మరొకరు మృతి
ఇప్పటికే పలువురు ఆస్పత్రిపాలు

విజృంభిస్తున్న వీధికుక్కలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ఇటీవల కాలంలో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఓ వృద్ధురాలిని పొట్టన పెట్టుకున్న వీధి కుక్కలు తాజాగా సోమవారం మరో వ్యక్తిపై దాడి చేసి చంపేశాయి. దీంతో మండల ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతు న్నాయి. ఇటీవల వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి అనే వృద్ధురాలు బహిర్భూమికి వెళ్లగా కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం మరవకముందే సోమవారం ఉదయం బిత్తర పాడుకు చెందిన నీరస శంకర్రావుపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. అనంతరం మరో వ్యక్తి సీర శంకర్రావుపై కూడా దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన చినమేరంగి సిహెచ్‌సికి తరలించి చికిత్స అందిస్తు న్నారు. ఇటీవల కుక్కల దాడుల్లో తీవ్రంగా గాయపడిన గొడవ సరోజిని, గంట లక్ష్మి , గౌరీపురం గ్రామానికి చెందిన పల్లవి అనే చిన్నారి ఇప్పటికే చికిత్స పొందుతున్నారు. అంతేకాకుండా పశువులు, గొర్రెలను కూడా పొట్టను పెట్టుకున్న ఈ కుక్కల గుంపుపై చర్యలు తీసుకునేందుకు అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ లక్ష్మి (ఫైల్)

మరోపక్క ఏనుగుల దాడిలో తమ ప్రాణాలను కోల్పోయి పంట నష్టాన్ని భరిస్తూ ఏళ్ల తరబడి నష్టాన్ని చవిచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కలను, ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, లేకుంటే మరెన్నో ప్రాణాలు కోల్పోవడం ఖాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడిలో మృతి చెందిన నీరస శంకర్రావు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని బిత్తరపాడు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మృతి చెందిన శంకర్రావుకు భార్య చంద్రకళ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

డ్రైవర్ మార్టిన్‌కు నివాళ్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ శుక్రవారం రాత్రి మృతి చెందిన టి.మార్టిన్‌కు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ నివాళ్లు అర్పించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మార్టిన్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలిని ఘటించారు. డ్రైవర్ మార్టిన్ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందడం, శస్త్ర చికిత్స అనంతరం కూడా వైద్యపరంగా ఇతర సమస్యలు తలెత్తడంతో శుక్రవారం తుది శ్వాస విడిచిన విషయం విదితమే. ఈ మేరకు క్యాంపు కార్యాలయ సిబ్బందితో పాటు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన జిల్లా ఆవిర్భావం నాటి నుంచి ఎంతో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ వుండేవారని కొనియాడారు. ఆయన మరణ వార్త అందరి హృదయాలను కలచివేసిందన్నారు. మార్టిన్ సేవలు అధికారులు జ్ఞాపకం చేసుకునే వారని పేర్కొన్నారు. మార్టిన్ మృతి పట్ల చింతిస్తూ, అతని ఆత్మకు శాంతి చేకూరాలని, ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలిపారు.

పుస్తకాల స్టాక్‌ను పరిశీలిస్తున్న డిఇఒ పగడాలమ్మ

స్టాక్ పాయింట్లను డిఇఒ పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

విద్యా కానుక సంబంధించిన మక్కువ, ఎర్రసామంతవలసలో గల స్టాక్ పాయింట్లు డిఇఒ జి.పగడాలమ్మ సోమవారం పరిశీలించారు. అనంతరం విద్యాశాఖ అధికారులతో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా పాఠ్యపుస్తకాలు పంపిణీకి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని, ఇంకేమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం నాడు నేడు పనులు జరుగుతున్న పాఠశాలలను కూడా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ -1 సత్యనారాయణ, 2 శ్యామసుందర్, ఎపిసిలు శంకరరావు, సూరజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఎంఆర్‌సి కేంద్రంలో గల విద్యా కానుక స్టాకు రూమును సోమవారం డిఇఒ జి.పగడాలమ్మ పరిశీలించారు. పాఠశాలల పునః ప్రారంభానికి అన్ని విద్యా కానుకుల కిట్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఎంఇఒ పి.జోగారావును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఒ -2 సతీష్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గిరిజనులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తొక్కుడువలసలో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 9గ్రామాల గిరిజనులు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన సిపిఎం జిల్లాకార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, కావున మన హక్కుల పరిష్కారానికి ఆదివాసీలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. స్థానికంగా గిరిజనులు 900 ఎకరాలు డి పట్టా భూములు గంగాపురం పంచాయతీలో తొక్కుడువలస, పనసభద్ర, పిడిలోవ, వెలగవలస, నందివలస, లక్ష్మణదొరవలస గ్రామాల్లో 30, 40 ఏళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ భూములు వారిని కాదని కొంతమంది గిరిజనులను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి సాగు చేస్తున్న భూములకు పట్టాలని, పట్టాలు వచ్చే వరకు భూ పోరాటం కొనసాగించాలని కోరారు. అలాగే గిరిజన గ్రామాలకు మంచినీటి సౌకర్యం, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని, ప్రజా పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారానికి సంఘాలు పెట్టి ఐక్యంగా పోరాడాలని కోరారు. వీరి పోరాటాలకు నిరంతరం ప్రజా సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. డివైఎఫ్ఐ నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ మన హక్కులు, పోరాటాలకు రక్షణగా ఉన్న రాజ్యాంగాన్ని బిజెపి ధ్వంసం చేస్తోందని, కావున రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాలు కలిసి పోరాడాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము, గిరిజన సంఘం నాయకులు బలరాం, శ్రీను, వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, అప్పలస్వామి, సింహాచలం, రామయ్య, బోడెమ్మ, తొమ్మిది గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ విలియం కేరీ

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని ఎమ్మార్ నగరం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈ ఏడాది పాలిసెట్ రాసిన అర్హులైన అభ్యర్థుల ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం సోమవారం ప్రిన్సిపల్ విలియం కేరి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి అభ్యర్థుల విజయేంద్రీకృత ధ్రువపత్రాల పరిశీలన కోసం ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించిందని, ఈ మేరకు ఈనెల 27 నుంచి జూన్ 3 వరకు తమ కళాశాలలో ధ్రువపత్రాలు పరిశీలన జరుగుతుందని అన్నారు. సోమవారం 1 నుంచి 12000 వరకు, ఈనెల 28న 12001 నుంచి 27000, 29న 27001 నుంచి 43000, 30న 43001 నుంచి 59000, 31న 59001 నుండి 75000, జూన్ 1న 75001 నుంచి 92 000, జూన్ 2న 108000 జూన్ 3న 108000 నుంచి ఆపై ర్యాంక్ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని ఆయన తెలిపారు.

మున్సిపల్ అధికారికి వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

6లోపు జీతాల సమస్య పరిష్కరించాలి

లేకపోతే సమ్మెకు వెళ్తాం : కార్మికులు

ప్రజాశక్తి - సాలూరు

పురపాలక సంఘం పాలకవర్గం, కమిషనర్లు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. పూర్తి స్థాయిలో జీతాలు విడుదల చేయకుంటే జూన్ 6 తర్వాత నిరవధిక సమ్మెకు ఏ రోజు నుంచైనా వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. 2024 సంవత్సరం జనవరికి గానూ రాష్ట్ర ప్రభుత్వం పండగ ఖర్చుల కింద వెయ్యి రూపాయలు కార్మికులకు విడుదల చేసిందని, అయితే నేటికీ ఆ డబ్బులు విడుదల చేయలేదని తెలిపారు. ఈ ఏడాది జనవరి జీతం బకాయి రూ.3వేలు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. ఇదే సంవత్సరం ఫిబ్రవరిలో పెరిగిన రూ.6వేలు వేతనాన్ని నేటికీ విడుదల చేయలేదని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుండి డ్రైవర్లకు రూ.24500 చెల్లించాలనే ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలని తెలిపారు. సాలూరు మున్సిపాల్టీలో పనిచేసి మరణించిన కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వడానికి పాలకవర్గం చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు. పై సమస్యలపై పాలకవర్గం మున్సిపల్ చైర్పర్సన్, కమిషనర్ స్పందించి పరిష్కరించాలని, లేకుంటే జూన్ 6 తర్వాత ఏ క్షణం నుంచైనా నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు కమిటీ నాయకులు టి రవి, టి సామయ్య ,జి స్వప్న, రాముడు, జి శంకర్రావు, నాగమణి, శ్యామలమ్మ, కొత్తమ్మ ,శీను పాల్గొన్నారు.

తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గిరిశిఖర గ్రామాల ప్రజలకు అనారోగ్యం చేస్తే డోలీ మోతలు తప్పడం లేదు. ఎన్నేళ్లయినా గిరిజన గ్రామాలకు పాలకులు రహదారి సౌకర్యం కల్పించకపోవడంతో గిరిజనులకు ఈ దుస్థితి తప్పడం లేదు. తాజాగా సోమవారం మండలంలోని బొడ్డవర పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో కేరంగి లక్ష్మి (21) గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో భర్త కేరంగి బంగారయ్య తోటి బంధువుల సహాయంతో 7 కిలోమీటర్ల దూరం డోలీ సాయంతో కొండ దిగువన గల మెట్టపాలెం గ్రామం వరకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు లక్ష్మి భర్త బంగారయ్య తెలిపాడు. ప్రస్తుతం లక్ష్మీ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

గర్భిణిని డోలీపై తీసుకొస్తున్న చిట్టంపాడు గిరిజనులు

జిల్లా కేంద్రంలో ఐటిఐ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ఐటిఐ చదువుతున్న విద్యార్థులకు పరీక్ష కేంద్రం లేకపోవడం అన్యాయమని వెంటనే పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎ.గంగారాం, అఖిల్, జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో గల ఎఒ వేణుగోపాల్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐటిఐ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, సాలూరు, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట ప్రాంతాల్లో గల ఐటిఐ చదువుతున్న విద్యార్థులు రాజాం, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి పరీక్షలు రాసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీనివల్ల విద్యార్థులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. కావున పార్వతీపురం కేంద్రంగా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గతంలో డిఆర్వో కేశవనాయుడుకు వినతిని అందించామన్నారు. ఈ మేరకు స్పందించి ఆయన డివిఇఒకమిటీ ద్వారా జ్యోతి ఐటిఐ కళాశాలను సందర్శించి విచారణ చెపట్టి ఒక నిర్దిష్ట నివేదికను రూపొందించారని తెలిపారు. అనంతరం పరీక్షా కేంద్రంపై ఎటువంటి చలనం లేకపోవడం దారుణమని వాపోయారు. ఈ విద్యా సంవత్సరంలో జులై చివరి వారంలో జరుగుతున్న పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పార్వతీ పురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు సరిపడా తరగతి గదులు, కంప్యూటర్లు, ల్యాబులు, తదితర అన్ని రకాల సౌకర్యాలు ఉన్నట్టు విద్యార్థుల తరపున ఎస్ఎఫ్ఐ భావిస్తుందని తెలిపారు. కావున ఉన్నతాధికారులు పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల జ్యోతి ఐటిఐ (ప్రైవేట్) కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి హర్ష, చైతన్య, సాయి, ముకేశ్, జగన్, సిద్దార్థ, వంశీ, వెంకీ, శ్రవణ్, అర్జున్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎఒకు వినతిని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కిశోర బాలికలకు నేడు అవగాహనా కార్యక్రమం

విజయనగరం : 'వరల్డ్ మెనుస్ట్రల్ హైజిన్ డే' సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యాన మంగళవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో గల కిషోర్ బాలికలంతా ఈలింకు ద్వారా (https://us06web.zoom.us/j/82600151105?pwd=8OTPurzRN5uk7PlbtXcR0n6x08bp13.1) పాల్గొనాలని కోరారు.

మొక్కలు నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

అడవులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వన సంరక్షణ సమితి అడవులను రక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అటవీ శాఖ సబ్ డిఎఫ్ఒ యాళ్ల సంజయ్ ప్రజలను కోరారు. తన పర్యటనలో భాగంగా మండలంలోని పి.ఆమిటి పంచాయతీ వంజరాపుగూడ సమీపానున్న విఎస్ఎస్ భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. అడవులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అడవులను పరిరక్షిస్తే వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, తద్వారా పంటలు సకాలంలో పండించడానికి వీలుంటుందన్నారు. రోజురోజుకు కలుషితమైన వాతావరణతో మనుగడ కూడా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. వాతావరణాన్ని పరిరక్షించిన నాడే మనిషి ఆరోగ్యంగా జీవించగలడన్నారు. వన సంరక్షణ భూములను ఎవరైనా ఆక్రమించినా, అందులో చెట్లు కొట్టినా శిక్షార్హులవుతారని అన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ మణికంఠేశా, ఫారెస్ట్ సింహాద్రి, అటవీ శాఖ సిబ్బంది తిరుమల, రామారావు ఉన్నారు.

చేతివేళ్ల ప్రాధాన్యతపై అవగాహన

ప్రజాశక్తి -పాలకొండ

మనకుండే ఐదు వేళ్ల ప్రాధాన్యతను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత, యోగా గురువు కె.జనార్ధనరావు విద్యార్థులకు వివరించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరంలో ఆయన మాట్లాడారు. చిటికెన వేలు ఆటలు, ఉంగరపు వేలు పాటలు, మధ్య వేలు చదువు, చూపుడు వేలు పనులు, బొటన వేలు ధ్యానానికి సంబంధించినవని తెలిపారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినులు ఆటలు, పాటలు, చదువు, పనులు, ధ్యానం చేస్తే ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదిగి సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

15 నుంచి రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులో రాష్ట్ర జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని ఆయన సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం సంఘం కార్యాలయం వద్ద నాయకులు మహాసభల పోస్టల్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం రోజురోజుకు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతుందన్నారు. రైతు వినాశకర చట్టాలను కేంద్రప్రభుత్వం తీసుకురావడంతో చిన్న, పేద, మధ్యతరగతి రైతాంగం భూముల్ని వదిలి వేసే పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతుల పరిస్థితిపై ఈ మహాసభలో చర్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, జిల్లా కార్యదర్శి దంతులూరి వర్మ, జిల్లా సహాయ కార్యదర్శులు పి.శ్రీనునాయుడు, మోనంగి భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో గిరిజన విద్యార్థికి మూడో స్థానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ చదువుతున్న తాడంగి వినయ్ జిల్లాలో మూడవ ర్యాంక్ సాధించినట్టు కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీవరం తెలిపారు. కళాశాలలో వినయ్ మంచి ప్రతిభగల విద్యార్థి అని, అనేక పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటుకొని డిగ్రీ ఫలితాల్లో మంచి ఫలితాలు సంపాదించాడని అన్నారు. ఇంకా పై చదువులు చదివి వివిధ పోటీ పరీక్షలు రాసి మంచి ఉద్యోగాన్ని పొందాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్‌తో పాటుగా అధ్యాపకులు కూడా వినయ్‌ను అభినందించారు.

చిత్రలేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పిపి ఈతమానుగూడ పంచాయతీ పరిధిలో ఇప్పగూడలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ చిత్రలేఖనంపై రెండు రోజులు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రిసోర్స్ పర్సన్ (ఆరిక శ్రీను, ఆంధ్రా యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్) విద్యార్థి చిత్రలేఖనంపై మెలుకువలు శిక్షణ ఇచ్చారు. అదే విధంగా ఈ శిక్షణకు మూడు మండలాల నుంచి 30మంది పాల్గొన్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, చిత్రలేఖనం విశిష్టత గురించి శిక్షణ కార్యక్రమంలో వెన్నెల శిక్షణను వెలుగు అసోసియేషన్ సిబ్బంది మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచి కుటుంబ సభ్యులన పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మాజీ సర్పంచి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదభోగిలి మాజీ సర్పంచు లెంక లక్ష్మి భర్త రాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాజీ సర్పంచ్ లక్ష్మి నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల వైసిపి అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, సీనియర్ నాయకులు ఆర్వీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాయినగర్ లో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని సాయినగర్ కాలనీలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఉష , ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది ,పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు

పరిహారం చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పాంచాలి పంచాయతీలో గల సీతంపేట, జీలికవలస గిరిజనులు సాగు చేస్తున్న పంట భూములు గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి వల్ల భూములు కోల్పోయిన గిరిజనులకు పరిహారం చెల్లించాలని సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో వాహనాలను నిలిపివేసి నష్ట పరిహారం చెల్లించాలని సోమవారం ఆందోళన చేశారు. భూములు కోల్పోయిన గిరిజనులు కొర్ర సోమయ్య, డుంబురు లచ్చయ్య, సింగరాపు చిన్నయ్య, రొడ్డ జెన్నీ, సోంబయ్య, సోమయ్య, లచ్చయ్య, పైడమ్మ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు మాట్లాడారు. భూములు కోల్పోయిన నిరుపేద రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. పండించిన జీడి తోటలను రహదారుల పనుల సందర్భంగా ధ్వంసం చేశారని, మిగతా పంట భూముల్లో గ్రీన్ ఫీల్డ్ రహదారి వల్ల రాళ్లు, మట్టి పోసేశారని తెలిపారు. సాగు భూముల్లో వేస్ట్ మెటీరియల్ వేసి పంట భూములను ధ్వంసం చేస్తున్నారని, సాగు చేస్తున్న రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇలా వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ, ఇతర గ్రీన్‌ఫీల్డ్ హైవే ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఆ గ్రామాల్లో గిరిజనులకు భూములు కోల్పోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ప్రజా సంఘాలను కూడగట్టి ఆందోళన చేపడుతామని అన్నారు.

ఆందోళన చేస్తున్న బాధిత గిరిజన రైతులు

అనుమతి పత్రాలు లేని వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలోనిరెల్లి వీధి, దొనకవీధి, డప్పు వీధుల్లో స్థానిక ఎస్సై ఎస్.షణ్ముఖరావు తన సిబ్బందితో కలిసి సోమవారం కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి అనుమతి పత్రాల్లేని 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అనంతరం ఆయన కార్డాన్ సెర్చ్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కొండ, సెగిడి తదితర వీధుల్లో సోమవారం పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో ఉన్న ఎటువంటి అనుమతులు లేని 20 ద్విచక్ర వాహనాలను, ట్రాలీ వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు అనుమానం వచ్చిన గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. ముగ్గురు, నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే చోట ఉంటే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే అనుమానం వచ్చిన వారిపై కూడా కేసు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వీరఘట్టం, దోనుభాయ్ ఎస్సైలు ఎస్కే ఫక్రుద్దీన్, అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని తోణాం రూరల్ సిఐ బాలకృష్ణ గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుతంగా జరిగాయని, ప్రస్తుతం 144 సెక్షన్ ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇందులో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానిత వ్యక్తుల వద్ద ఆధార్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మోటార్ వాహనాలకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు చూపని వారి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఎం.వెంకటరమణ, పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి -కొమరాడ

పాలకుల నిర్లక్ష్యమా..? గిరిజనులు చేసుకొన్న పాపమోగానీ 18 ఏళ్లు కావస్తున్నా నాగావళి నదిపై తలపెట్టిన పూర్ణపాడు-లాబేసు వంతెన నేటికీ పూర్తికాలేదని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన నాయకులు చిన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వంతెన నిర్మిస్తున్న ప్రదేశాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో సిపిఎం ఎమ్మెల్యేగా ఉన్న కోలక లక్ష్మణమూర్తి అసెంబ్లీలో దీనిపైన నిలదీసి వంతెన నిర్మాణానికి రూ.3.50కోట్లు మంజూరు చేయించారన్నారు. నేటికి 18ఏళ్లు కావస్తున్నా 60 శాతం పనులను టిడిపి, కాంగ్రెస్, వైసిపి పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. వంతెన పూర్తి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేయడంతో పాటు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో 14 రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేసిన సందర్భంలో కలెక్టర్‌ను కలిసిన సందర్భంలో వర్షం తగ్గిన వెంటనే వంతెన పెండింగ్ పనులు ప్రారంభించమని అధికారులను ఆదేశించారన్నారు. అయితే కాంట్రాక్టరుకు బకాయిలు చెల్లించకపోవడంతో ఆయన పనులను నిలిపివేశారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులుంటే వెంటనే చెల్లించి కాంట్రాక్టర్ రప్పించి పనులు పూర్తి చేయాలని కోరారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సిఆర్‌టిలను కొనసాగించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పాఠశాలలను తెరవడానికి ముందే రానున్న విద్యా సంవత్సరానికి గాను కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లను, సవర భాషా వాలంటీర్లను కొనసాగించాలని ఎపిటిఎఫ్ మన్యం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, ఎం.బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖ పార్వతీపురంలో డిప్యూటేషన్ చేయబడిన ఉపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లను తక్షణమే వారి మాతృ స్థానానికి పంపించాలని, ఏ ఆశ్రమ పాఠశాలలో డిప్యూటీ వార్డెన్ ఖాళీగా ఉంటే అదే పాఠశాలకు సంబంధించిన సిబ్బందిలో నుండి మాత్రమే ఒకరికి డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు అప్పగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి పోస్టును ఇతర పాఠశాలల సిబ్బందికి ఇవ్వకూడదని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

కళాశాల ప్రవేశానికి 10న కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటికె పరిధిలో నిర్వహిస్తున్న పెద్దమడి గిరిజన బాలుర గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి గానూ జూన్ 10న పెద్దమడి కళాశాలలోనే కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు పిఒ శుభం బాన్సర్ ఒక ప్రకటన తెలిపారు. జూన్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గిరిజన బాలుర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులు ఉన్నాయని తెలిపారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ

ఎంపిపి బొమ్మాలి భాను అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. మూడు శాఖల మీద మాత్రమే సమావేశంలో చర్చ జరిగింది. దీంతో పాటు అధికారులు, సభ్యులు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ప్రశ్నించాల్సిన ప్రజాప్రతినిధులతో పాటు, సమాధానం చెప్పాల్సిన అధికారులు కూడా పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంతో సమావేశం చప్పగా సాగింది. ఖరీఫ్ కాలానికి రైతులకు సాగునీరు అందించాలని ఆ శాఖ అధికారులను కోరారు. దీనిపై ఎఇ శంకరరావు మాట్లాడుతూ ఎడమ కాలువ పనులు పూర్తి కాలేదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాశ్, వాకముడి అనిల్, ఎంపీడీవో ప్రసాదరావు, పలుశాఖల అధికారులు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

వర్షాకాలం ప్రారంభం కానున్న తరుణంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.జగదీష్ తెలిపారు. మండలంలోని వనజలో ఆయన మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కానున్న విషజ్వరాలు, డయేరియా, డెంగీ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మనం నివసించే ప్రదేశాల్లో నీరు నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవడం, కలుషితమైన నీరు తాగకూడని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, నిల్వ ఉన్న మాంసాహారాన్ని, ఇంకా ఏ ఇతర పదార్థాలను తినడం మంచిది కాదని అన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలను ఉపయోగించాలని సూచించారు. ఎవరికి ఏ విధమైన అనారోగ్య సమస్యలు వచ్చినా ఆలస్యం చేయకుండా అందుబాటులో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించాలన్నారు. అశ్రద్ధ చేసి ప్రాణాలు కోల్పో వద్దని సూచించారు. అలాగే వైద్య శిబిరానికి సుమారు 30 మంది వరకు హాజరయ్యారని, వీరందరికీ వివిధ రకాలైన పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం పద్మావతి, హెచ్ఒ నారాయణ రావు, రాజేష్ , శ్రీనివాసరావు, హెచ్ఎస్ శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఎల్విన్‌పేట ఆర్‌బికెకు చేరుకున్న ఎరువులు

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ ఖరీఫ్ సీజన్‌కు మండల రైతులకు యూరియా, డిఎపి అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సిహెచ్.ప్రసాదరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో గోడౌన్ సదుపాయం ఉన్న అన్ని రైతుభరోసా కేంద్రాల్లో యూరియా, డిఎపి ఎరువులు ముందస్తుగా పంపించామన్నారు. మిగతా రైతు భరోసా కేంద్రాలకు కూడా ఈ వారం రోజుల్లో వీటిని పంపిస్తామన్నారు. డిఎపి వంద మెట్రిక్ టన్నులు, యూరియా 200 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. మరో వారం రోజుల్లో అవసరమైన మేరకు మండలానికి ఎరువులు రానున్నాయని తెలిపారు. ఎల్విన్ పేట, కుక్కిడి, దుడ్డ కళ్లు, బాలేసు, గొరడ, మండ, కేదారి పురం రైతు భరోసా కేంద్రాలకు ఈ ఎరువులను పంపించామని ఆయన తెలిపారు. ఆయా రైతు భరోసా కేంద్రాలకు చెందిన గిరిజన రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైజినిక్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో నివసిస్తున్న నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు పార్వతీపురం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో హైజినిక్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పైడా కొండలరావు, సభ్యులు కిరణ్, నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

బటన్ నొక్కిన నిధులు ఏమైనట్టు.?

ప్రజాశక్తి- బొబ్బిలి

జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు బటన్ నొక్కి కొన్ని నెలలు కావస్తున్న తల్లుల ఖాతాలకి జమ కాలేదని ఆ నిధులు ఏమయ్యాయని పిసిసి అధికార ప్రతినిధి ముువ్వల శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కొన్ని నెలలుగా ఖాతాల్లో విద్యాదీవెన నిధులు జమ కాకపోవడం వల్ల ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు.

చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

మండలంలోని గోపాలపల్లి గ్రామానికి చెందిన ఒనుం సంతోష్ (36) కల్లు గీస్తూ ఆదివారం చెట్టు పై నుంచి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని గీత కార్మికుల సంఘ గౌరవాధ్యక్షులు పురం అప్పారావు, జిల్లా అధ్యక్షుడు కొల్లి అప్పారావు పరామర్శించారు. మృతునికి భార్య కోటమ్మ, తండ్రి ఆదినారాయణ ఉన్నారు.

భార్యను హ్యత చేసిన భర్త

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. మూడేళ్ల పాటు బాగానే ఉన్నారు. గడిచిన ఆరు నెలల కాలం నుంచి భార్య తాను చెప్పిన మాట వినడం లేదంటూ తనలో కోపాన్ని పెంచుకొని రాక్షసుడిగా మారాడు. పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకువచ్చి మరి దారుణంగా చంపేసిన ఘటన మండలంలోని ఒడ్డుమరిపల్లి గ్రామం వద్ద జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సిఐ మురళి రావు మృతురాలి తల్లిదండ్రులు గుగ్గి రాము, కృష్ణమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడ్డుమరిపల్లి గ్రామానికి చెందిన చీమల కనకారావు గుగ్గి దారప్పను నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. దారప్ప ఏడాదిగా లచ్చన్న దొరపాలెంలో ఉన్న హోటల్లో పని చేస్తుంది. దీనిని మానివేయాలని గడిచిన ఆరు నెలలుగా ఆమె భర్త కోరుతున్నాడు. దీన్ని దారప్ప నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కనకారావు ఇంటికి వెళ్లి దారప్పను బాగా చూసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు మాటిచ్చి తీసుకెళ్లాడు. తర్వాత గ్రామ సమీపంలో ఉన్న జీడి తోట వద్ద మరోసారి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో ఆమె చున్నీతో పీక బిగించి చంపేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని గ్రామ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద ఉన్న తుప్పల్లో పడేశాడు. తన వెంట తీసుకెళ్లిన తన కుమార్తె ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆదివారం రాత్రి నుంచి తన అల్లుడును అడిగారు. చివరికి సోమవారం తాను తన భార్యను చంపేశానని చెప్పి చంపిన ప్రదేశాన్ని చూపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో తాను సంఘటనా స్థలానికి చేరుకున్నాని సిఐ మురళి రావు తెలిపారు. అనంతరం తహశీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పంచనామా చేసి మృతదేహాన్ని ఎస్ కోట సిహెచ్‌సికి తరలించారు. ఎప్పుడు లేని విధంగా తమ గిరిజన గ్రామంలో ఇటువంటి సంఘటన జరగడంతో గిరిజనులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. హంతకుడుని అదుపులోకి తీసుకున్నామని సిఐ తెలిపారు.

ఆస్పత్రి వద్ద గిరిజనుల ధర్నా

పోస్టు మార్టం నిమిత్తం ఎస్‌కోట ఏరియా ఆస్పత్రి వద్దకు దారప్ప మృత దేహాన్ని ఉదయం 10గంటలకు తరలించినా సాయంత్రం వరకూ పోస్టు మార్టం చేయలేదు. దీంతో గిరిజనులు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. డ్యూటీ డాక్టర్ స్పందిస్తూ మంగళవారం ఉదయం చేస్తామని చెప్పారు. అయితే ఈ విషయం ఉదయం ఎందుకు చెప్పలేదని గిరిజనులు ప్రశ్నించారు.

దుకాణాలపైకి దూసుకెళ్లిన భారీ క్రేన్

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస జంక్షన్‌లో సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఎటువంటి ప్రాణానష్టం లేకపోయినప్పటికీ ఆస్తి నష్టం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రం విశాఖ - అరకు ప్రధాన రహదారిలో ఉన్న మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ ఎదురుగా సోమవారం ఎపి31 డిటి4691 నెంబరు గల భారీ క్రేన్ విశాఖపట్నం వైపు నుంచి ఎల్‌కోట మండలంలో గల మహామాయ కర్మాగారానికి వెళుతుంది. ఈ వాహనం కొత్తవలస మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి దానికి ముందు బాగానే వెళ్తున్న ఆటోని గమనించకుండానే అత్యంత వేగంగా దూసుకెళ్లింది. వేగాన్ని నియంత్రించలేక రోడ్డు పక్కనే ఆటో మెకానిక్ షాప్ వద్ద చిరు వ్యాపారం చేసుకునే వారిపై దూసుకెళ్లింది. దీంతో షాపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇందులో కొత్తవలస మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదానికి క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణమని స్థానికులు అంటున్నారు. అత్యంత వేగంగా డ్రైవింగ్ చేయడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని, ఉదయం కావడంతో షాపులు ధ్వంసమై ప్రాణనష్టం తప్పిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. క్రేన్ యజమానులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులు పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదులూ చేయకుండానే రోడ్డుపైనే పంచాయతీ సెటిల్మెంట్ చేసుకొని సంఘటనా స్థలం నుండి ఉడాయించారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో మృతి చెందిన కార్తీక్

లోయలో ఆటోబోల్తా

ఒకరి మృతి : 16మందికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కొత్తగూడ పంచాయతీ వంభరెల్లి ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా ఆటో లోయలో బోల్తా పడి 17 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కార్తీక్ (12) మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వంబరేల్లి గ్రామస్తులు సోమవారం సీతంపేట సంతకు వచ్చారు. ఉదయాన్నే నిత్యవసర సరుకులు కొనుక్కొని పనులు ముగించుకొని ఆటోలో వెళ్తున్నారు. వంబరెల్లి ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా గేర్ పడకపోవడంతో వెనక్కి వెళ్లి లోయలో పల్టీ కొట్టింది. దీంతో 17మందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే అంబులెన్స్ ద్వారా సీతంపేట ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రులకు తీసుకొచ్చారు. వీరిలో సవర కార్తీక్ తనకు బలమైన గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వీరిలో ఏడుగురు సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారిని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ఎం.జగదీష్‌నాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌టి కమిషన్ ఆరా

వంబరవెల్లి సమీపాన జరిగిన ఆటో బోల్తాపై రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆరా తీశారు. సంబంధిత అధికారులు, వైద్యులతో కమిషన్ చైర్మన్ స్వయంగా మాట్లాడి గాయపడిన వారికి మంచి వైద్యం అందించాలని ఆదేశించారు. ఆటో ప్రయాణీకులంతా సీతంపేట సంతకు వచ్చి తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంగా పోలీసులు గుర్తించారు.

టిడిపి, జనసేన నాయకుల పరామర్శ

ప్రమాద సంఘటన తెలుసుకున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మక జయకృష్ణ, టిడిపి పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పడాల భూదేవి, మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం క్షతగాత్రులను పరామర్శించారు. అలాగే ఎంపిపి బి.ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ హెచ్.మోహనరావు కూడా క్షతగాత్రులను పరామర్శించారు.

బొలేరో వాహనం బోల్తా

సురక్షితంగా బయటపడ్డ గిరిజనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన దుడ్డుఖల్లు పంచాయతీ పరిధిలో ఉన్న దేరువాడ, కంబగూడ గ్రామాల ప్రధాన రహదారి సమీపంలో సోమవారం ఉదయం బొలేరో వ్యాన్ బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న గిరిజనులకు స్వల్ప గాయాలయ్యాయి. దేరువాడ నుంచి కురుపాం వైపు వస్తున్న బొలెరో వాహనం ప్రమాదానికి గురికావడంతో గమనించిన స్థానికులు వాహనంలో ఉన్న వారిని బయటకు తీశారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.